

కక్ష సాధింపులతో రాక్షసానందం
రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందని.. అభివృద్ధి లేకపోగా, ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. -8లో



లారీ డ్రైవర్ బీభత్సం
మద్యం మత్తులో లారీ డ్రైవర్ బీభత్సం సృష్టించాడు. ఓ ద్విచక్ర వాహనం, ప్రైవేటు బస్సును ఢీకొట్టి అదుపుతప్పి రోడ్డు పక్కనున్న బంకు, చెట్టును ఢీకొట్టాడు. -8లో

గరిష్టం/కనిష్టం
38.2/24.5

వాతావరణం
జిల్లాలో గురువారం 24.5 – 38.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

అడ్మిషన్ల గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్ల గడువును మే 19 వరకు పొడిగించినట్లు మను కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ విలయత్ అలీ బేగ్ తెలిపారు. పదో తరగతి అర్హత (రెగ్యులర్ లేక ఓపెన్)తో ఉర్దూ మీడియం లేకపోతే ఉర్దూ సబ్జెక్ట్ చదువుకొని ఉండాలని తెలిపారు. రెండో సంవత్సరం పాలిటెక్నిక్ అడ్మిషన్ పొందాలంటే రెండేళ్ల ఐటీఐ లేకపోతే ఇంటర్మీడియట్ చదివి ఉండాలని తెలిపారు. ఇందులో ప్రవేశానికి జూన్ 13వ తేదీ మధ్యాహ్నం రాత పరీక్ష కడప క్యాంపస్‌లో ఉంటుందని చెప్పారు. పరీక్షా ఆధారంగా ర్యాంకు ద్వారా సీట్ భర్తీ చేస్తామన్నారు. వివరాలకు https:// manuucoe.in/RegularAdmissionలో తగు సమాచారం తెలిసుకోవచ్చని ఇన్‌చార్జ్ ప్రిన్సి పాల్ తెలిపారు. వివరాలకు కళాశాల అడ్మిషన్ కన్వీనర్ ఎం.సికందర్ హుస్సేన్ (93980 83058) ను సంప్రదించాలని సూచించారు.

బీఈడీ కళాశాల సీజ్

సాక్షి ఎఫెక్ట్..

ప్రొద్దుటూరు: స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని మలయాళ స్వామి బీఈడీ కళాశాలకు సంబంధించిన 13 గదులను ఆశ్రమ నిర్వహణ అధికారి రామచంద్రాచార్యులు గురువారం పోలీసుల సహకారంతో సీజ్ చేశారు. 2019 నుంచి మలయాళ స్వామి బీఈడీ కళాశాలకు సంబంధించి అద్దె చెల్లించడం లేదు. పలు మార్లు అధికారులు నోటీసులు జారీ చేసి కళాశాల నిర్వాహకులు పట్టించుకోలేదు. ఇప్పటికే శ్రీకృష్ణ గీతాశ్రమంలో జరుగుతున్న అవకతవకలపై పలు మార్లు సాక్షిలో కథనాలు ప్రచురించడం జరిగింది. బుధవారం ఈఓ నివేదికను ''తొక్కి పెట్టింది ఎవరు''అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ విషయంపై అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు.

పీజీ ఫలితాలు విడుదల



పరీక్షా ఫలితాలను విడుదల చేస్తున్న వైవీయూ రిజిస్ట్రార్ తదితరులు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంకాం నాలుగో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పుత్తా పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావు గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆచార్య పద్మ మాట్లాడుతూ ఏప్రిల్‌లో నిర్వహించిన ఈ పరీక్షల ఫలితాలు త్వరితగతిన విడుదలకు కృషిచేసిన పరీక్షల విభాగాన్ని అభినందించారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కెఎస్వీ కృష్ణారావు మాట్లాడుతూ ఎంఏ తెలుగు, హిస్టరీ, పీఎస్ అండ్ పీఏ, ఎకనామిక్స్, ఉర్దూ ఎంకాం కోర్సులలో విద్యార్థులు వంద శాతం ఫలితాలను సొంతం చేసుకున్నారని వివరించారు. ఫిజిక్స్ 90 శాతం , జువాలజీ 96.97 శాతం, బయోటెక్నాలజీ 97.62 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని సీఈ వివరించారు. పరీక్షల నిర్వహణ సహాయ అధికారులు డాక్టర్ కె. శ్రీనివాస రావు, కామర్స్ సహ ఆచార్యులు డాక్టర్ జి.హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారమే లక్ష్యం

- తాగునీటి బోర్లకు విద్యుత్ కనెక్షన్లు
- అందరికీ సమానంగా జెడ్పీ నిధులు
- సర్వసభ్య సమావేశంలో జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి



జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి, చిత్రంలో కలెక్టర్ శ్రీధర్



సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు

కడప సెవెన్‌రోడ్స్: వేసవిలో గ్రామీణ ప్రజల దాహార్తి తీర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జెడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి అన్నారు. అవసరమైన గ్రామాల్లో కొత్త బోర్లు, మోటార్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గురువారం జెడ్పీ చైర్మన్ అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి బోర్లకు యుద్ధ ప్రాతిపదికపై విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. గండిక్షేత్రంలో భక్తుల సౌకర్యం కోసం లక్ష లీటర్ల సామర్థ్యం కలిగిన తాగునీటి ట్యాంకర్‌ను నిర్మించేందుకు రూ.35 లక్షలు అవుతుందని, అందులో రూ.25 లక్షలు జెడ్పీ నిధులను సమకూరుస్తానని తెలిపారు. ఇందుకు సంబంధించిన అంచనా వ్యయాలను తయారు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈని ఆదేశించారు. అలాగే ప్రొద్దుటూరు మండలం కల్లూరులో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త పైప్‌లైన్ పనులను చేపట్టాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ నిధుల కేటాయింపులో అందరికీ సమన్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. బ్రహ్మంగారి మఠం మండలం మల్లేపల్లె చెరువులో ఈతకు వెళ్లి విద్యార్థులు మృత్యువాత పడటం బాధాకరమన్నారు. ఆ చెరువులో కాంట్రాక్టర్లు ఇష్టానుసారం గుంతలు తవ్వి మట్టి తరలించడం విద్యార్థుల మృతికి కారణమన్నారు. బాధ్యులైన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవడంతోపాటు వారినుంచే బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ఇప్పించేందుకు ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

- ఇటీవల గాలివానకు మామిడి, చీనీ రైతులు తీవ్రంగా నష్టపోయారని చక్రాయపేట జెడ్పీటీసీ శివప్రసాద్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. రుణాల మంజూరుకు 1బీ ఒరిజినల్ కావాలని బ్యాంకర్లు అడుగుతున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు తెల్లకాగితంపై ఇస్తున్నందున రైతులకు ఇబ్బందిగా ఉందన్నారు.
- వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ అరటి రైతులను ఆదుకోవాలని కోరారు. మార్కెటింగ్‌శాఖ ద్వారా అరటి ఎగుమతి చేసి డబ్బును రైతుల ఖాతాల్లో జమచేయాలన్నారు. పులివెందులలోని కోల్డ్ స్టోరేజీ ప్లాంటును వినియోగంలోకి తీసుకురావాలన్నారు. వేంపల్లెలో రైతు బజారును వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. వేంపల్లె గ్రామ పంచాయతీ శానిటేషన్ వర్కర్లకు సంబంధించి రూ. 15 లక్షల నిధులు అందుబాటులో ఉన్నా డ్రా చేసి వారికి జీతాలు ఇవ్వడం లేదని ఆరోపించారు.
- వీఎన్ పల్లె ఎంపీపీ రఘునాథరెడ్డి మాట్లాడుతూ అరటి, ఇతర ఉద్యాన పంటలకు సరైన ధరలు లేవన్నారు. భూ ఆధార్ కింద తమ మండలంలోని గంగిరెడ్డిపల్లె భూములు వెబ్‌ల్యాండ్‌లో చూపడం లేదన్నారు.
- కడప మార్కెట్‌యార్డులో కనీస వసతులు కల్పించాలని కో ఆప్షన్ సభ్యులు అచ్చుకట్ల కరీముల్లా కోరారు. మార్చి నుంచి జూన్ వరకు మార్కెట్‌కు పసుపు పంట వస్తుంటుందని, అదనపు గోడౌన్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరారు.
- జెడ్పీ వైస్ చైర్మన్ పిట్టు బాలయ్య మాట్లాడుతూ పెండ్లిమర్రి మండలంలో ఉల్లి విత్తనాలు మొలకెత్తక రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. మైదుకూరు ఫర్టిలైజర్ షాపు యజమానులు ఈ విత్తనాలు సరఫరా చేశారని, వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు రైతులకు పరిహారం ఇప్పించాలని కోరారు.

ఘన నివాళి: పాక్ దాడిలో అశువులు బాసిన వీర జవాను మురళీ నాయక్, వయోభారంతో ఇటీవల మరణించిన జెడ్పీ మాజీ చైర్మన్ సీఎం బలరామిరెడ్డి మృతికి సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరితోపాటు వివిధ శాఖల అధికారులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చండి: ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ



బద్వేలు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న ప్రజల దాహార్తిని తీర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ కోరారు. గోపవరం మండలం, అట్లూరు ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. అక్కడ మోటారు, పైపులైన్లు ఏర్పాటు చేయాలన్నారు. వరికుంట్ల గ్రామంలో లిఫ్ట్ పనులు పూర్తయ్యాయని, మోటారు ఏర్పాటు చేయాలని కోరారు.

రైతులను ఆదుకోండి: నరేన్



రైతులను అన్ని విధాల ఆదుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల ఉత్పత్తులకు ఎంఎస్‌పీ చెల్లించడం లేదన్నారు. అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయకపోవడం విచారకరమన్నారు. అరటి, బొప్పాయి పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఇందుకు కలెక్టర్ బదులిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన రైతుల జాబితాలో ఇప్పటివరకు 2.10 లక్షల మందిని వెరిఫై చేశామని, ఇంకా మిగిలిన కొంతమందిని వెరిఫై చేసి పంపుతామన్నారు.

పనులు అడ్డుకుంటున్న 'వరద': వైస్ చైర్మన్ శారద



తన స్వగ్రామమైన రామాపురం గ్రామంలో తాగునీరు, స్మశానానికి అవసరమైన రహదారి ఏర్పాటుకు సంబంధించి జిల్లా పరిషత్ అధ్యక్షురాలిగా ఉన్న సమయంలో తాను ప్రతిపాదించిన పనులకు అంచనాలు వేయనీయకుండా ఎమ్మె ల్యే వరదరాజులరెడ్డి అడ్డుకుంటున్నారని జెడ్పీ వైస్ చైర్మన్ జేష్టాది శారద ఆరోపించారు. రాజకీయ కక్షతో పనులను అడ్డుకోవడం సరికాదన్నారు. ఒక దళిత మహిళ ప్రతిపాదించిన పనులను అడ్డుకోవడం ఎంతవరకు సబబని ఆమె ప్రశ్నించారు. అధికారులు ఎమ్మెల్యే ఒత్తిళ్లకు తలొగ్గకుండా అంచనాలు తయారు చేయించి సమర్పించాలని కోరారు.

సోలార్ కంపెనీపై చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి



పెద్దముడియం మండలంలో ఓ ప్రైవేటు సోలార్ కంపెనీ పాల్పడుతున్న దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేయాలని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. రైతులకు చెప్పకుండానే వారి పట్టా భూముల్లో దౌర్జన్యంగా గుంతలు తవ్వి ఫిల్లర్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఇందుకు అభ్యంతరం చెప్పిన రైతులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. గత ఖరీఫ్, రబీలో పంటలు నష్టపోయిన రైతులందరికీ పెట్టుబడి సాయం ఇంతవరకు అందలేదన్నారు. అన్నదాత సుఖీభవ కింద తక్షణమే సాయం అందించి ఆదుకోవాలన్నారు. రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విత్తనాలు సకాలంలో సరఫరా చేయాలని కోరారు. తన స్వగ్రామమైన గుండ్లకుంటలోని జెడ్పీ హైస్కూలు పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. చెరువుల్లో కాంట్రాక్టర్లు ఇష్టమొచ్చినట్లు గుంతలు తవ్వడం వల్లే ఈతకు వెళ్లిన పిల్లలు చనిపోతున్నారని వాపోయారు. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువుల్లో 30 అడుగుల లోతు గుంతలు తవ్వేస్తున్నారని, వీటిని అరికట్టాలన్నారు.

ఎట్టకేలకు.. ఒక హాల్టింగ్

- ఫలించిన ఎంపీ మిథున్‌రెడ్డి కృషి
- వారానికి ఒకసారి చెర్లపల్లె–తిరుపతి స్పెషల్‌ట్రైన్
- ఒంటిమిట్టలో హాల్టింగ్ సౌకర్యం



ఒంటిమిట్ట రామాలయం

రాజంపేట: రాష్ట్రంలో వైష్ణవ క్షేత్రంగా వెలుగొందుతోంది ఒంటిమిట్ట(ఏకశిలానగరం) కోదండ రామాలయం. ఇక్కడ ఉన్న స్టేషన్‌లో ఇప్పటి వరకు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వలేదు..ఇటీవల చర్లపల్లె–తిరుపతి (07017–07018) నంబరు గల స్పెషల్‌ట్రైన్‌కు ఎట్టకేలకు హాల్టింగ్ ఇచ్చారు. ఒకరకంగా హాల్టింగ్‌లో కదలిక మొదలైందని చెప్పుకోవచ్చు.

- రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల ముందు ఒంటిమిట్టలో దూరప్రాంతరైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని రైల్వేమంత్రిత్వశాఖను కోరారు. అలాగే 'సాక్షి'లో రామయ్య దరిచేరేదేలా అనే శీర్షికతో అనేక మార్లు కథనాలు వెలువడ్డాయి. దీంతో ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వరనే నానుడి తుడిచిపెట్టుకుపోయింది.
- తిరుపతి–చర్లపల్లె మధ్య నడిచే స్పెషల్‌ట్రైన్‌కు హాల్టింగ్ ఇవ్వడంతో తెలంగాణా ప్రాంతం , కర్నూలు జిల్లాల నుంచి కూడా భక్తులు వచ్చేందుకు వీలు కలిగింది. శనివారం తిరుపతిలో 4.40 సాయంత్రం 4.40కి బయలుదేరి ఒంటిమిట్టకు 7.05 గంటలకు చేరుకుంటుంది. మరుసటిరోజు ఉదయం 7.10కి చర్లపల్లెకు చేరుకుంటుంది. ఆదివారం రాత్రి 9.45కు చర్లపల్లెలో బయలుదేరి, మరుసటిరోజు ఉదయం 7.50కి ఒంటిమిట్ట, 10 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది.

రెగ్యులర్ ట్రైన్స్ హాల్టింగ్ సౌకర్యం కల్పించాలి

ఒంటిమిట్ట రైల్వేస్టేషన్ మీదుగా నడిచే రెగ్యులర్ ట్రైన్స్‌కు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, రాయలసీమ, ఎంజీఆర్ చెన్నై ఎక్స్‌ప్రెస్, విశాఖ–కడప ఎక్స్‌ప్రెస్, హరిప్రియ రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని ఇది వరకే ఎంపీ మిథున్‌రెడ్డి రైల్వే మంత్రిత్వశాఖను తన లేఖ ద్వారా కోరారు. అయితే స్పెషల్‌ట్రైన్‌కు హాల్టింగ్ ఇచ్చారంటే..ఇక రెగ్యులర్ ట్రైన్స్‌కూడా హాల్టింగ్ ఇచ్చే అంశాన్ని రైల్వేపరిశీలనలో ఉన్నట్లు కనిపిస్తోంది. రెగ్యులర్ ట్రైన్స్ హాల్టింగ్ ప్రభుత్వం, టీటీడీ నుంచి కూడా రైల్వేశాఖపై ఒత్తిడి తీసుకురావాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

గాలివాన బీభత్సం



చిన్నచెప్పలిలో పొలాల్లో పడిపోయిన ఇంటి పైకప్పు రేకులు



భారత్‌కాలేజ్ ఎదురుగా కూలిన కోళ్లఫారం

కమలాపురం: కమలాపురం మండలంలో గురువారం తెల్లవారుజామున గాలివాన బీభత్సం సృష్టించింది. అర్ధరాత్రి దాటాక ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలో విద్యుత్ సరఫరా స్తంభించి పోయింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చిన్నచెప్పలిలో మహ్మద్ సబియాకు చెందిన ఇంటి పైకప్పు రేకులు లేచి దూరంలో పడి పోయాయి. ఓ వైపు గాలి వాన, మరో వైపు ఇంటి పై కప్పు లేచి పోవడంతో ఆమె పిల్లలతో కలసి బిక్కు బిక్కుమంటూ తెల్లవారుజాము వరకు కాలం గడిపారు. వర్షం రాకతో పూర్తిగా నిరాశ్రయులయ్యామని, ప్రభుత్వం, అధికారులు స్పందించి ఆదుకోవాలని ఆమె వేడుకున్నారు. అలాగే పలు ప్రాంతాల్లో వృక్షాలు నేలకూలాయి.

నేలకూలిన కోళ్లఫారం

చింతకొమ్మదిన్నె: చింతకొమ్మదిన్నె మండలంలో కొలుములపల్లె, బుగ్గలపల్లె తదితర గ్రామాల్లో అరటి చెట్లు నేలవాలాయి. మామిడి కాయలు రాలిపోయాయి. కొత్త రోడ్డు సమీపంలో చెట్లు విరిగిపడడంతో పాటు విద్యుత్ స్తంభాలు నేల కూలాయి. దీంతో విద్యుత్ సరఫరా స్తంభించింది. సాయంత్రానికి విద్యుత్ శాఖ అధికారులు తిరిగి సరిచేయగలిగారు. భారత్ ఇంజనీరింగ్ కాలేజ్ ఎదురుగా ఉన్న కోళ్లఫారం షెడ్డు పడిపోవడంతో రైతు సుబ్బారెడ్డికి సుమారు రెండు లక్షలు రూపాయలు నష్టం జరిగింది.

హామీ ఏమైంది చినబాబూ!

- కాశినాయన క్షేత్రం అటవీ అనుమతులపై చేతులెత్తేసిన నారా లోకేష్
- రూ.5లక్షలతో కూల్చివేత చేపట్టిన వాటికి మాత్రమే పునః నిర్మాణం
- ప్రజాగ్రహం నుంచి తప్పించుకునేందుకు కూటమి నేతల హంగామా
- ఆపై అటవీ అనుమతుల గురించి విస్మరించిన వైనం



కాశినాయన క్షేత్రం



సాక్షి ప్రతినిధి, కడప: ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా?అన్నట్లుగా సీఎం చంద్రబాబు మంత్రి నారా లోకేష్ వ్యవహారశైలి ఉందని విశ్లేషకులు అంటున్నారు. మాట ఇవ్వడం ఆపై మరుగునపర్చడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. ఈ విషయంలో నారా లోకేష్ తండ్రిని మించిన తనయుడు అనిపించుకున్నాడు. కాశినాయన క్షేత్రంలో కూల్చివేతలపై మంత్రి నారా లోకేష్ వ్యవహరించిన తీరు అలాగే ఉంది. ఆధ్యాత్మిక క్షేత్రంలో కూల్చివేతలంటే ఎక్కడ తమ ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందోనని హడావుడి చేసి.. అక్కడంతా తానే సొంత డబ్బులతో చేసేస్తానని చెప్పిన లోకేశ్...ఓ చిన్న కట్టడం కట్టి చేతులు దులుపుకున్నాడు. ఇప్పుడు ఆ క్షేత్రంలో సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

- కాశినాయన క్షేత్రంలో సత్రాలు, ఇతర నిర్మాణాలను కూల్చివేసేందుకు అటవీ శాఖ నడుంకట్టింది. నిర్దాక్షిణ్యంగా అక్కడి నిర్మాణాలను కూల్చివేసింది. అప్పటికే అటవీ అనుమతుల కోసం కేంద్రానికి సీఎం హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లేఖ రాసినా అనుమతులు రాలేదు. ప్రభుత్వం మారడంతో చంద్రబాబు సర్కార్ అక్కడ కూల్చివేతల పర్వం చేపట్టింది. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమయ్యింది. ఆధ్యాత్మిక క్షేత్రంలో కూల్చివేతలపై అన్ని వర్గాల వారు నిరసన గళం విప్పారు. తమ ప్రభుత్వానికి ఎక్కడ చెడ్డపేరు వస్తుందోనని భయపడ్డ నారా లోకేశ్ హడావుడి చేశారు. ఏకంగా తన పీఏను పంపించి కూల్చివేసిన నిర్మాణాలను దగ్గరుండి కట్టించి రావాలని పురమాయించారు. ఆమేరకు ప్రచార మాధ్యమాలల్లో కూడా ప్రకటించారు. సొంత డబ్బులతో కూల్చివేసిన నిర్మాణాలు పునః నిర్మిస్తామని ప్రకటించారు. ఆపై పీఏ ద్వారా కాశినాయన క్షేత్రంలో ఓ 5 లక్షల రూపాయలతో స్వల్ప నిర్మాణాలు చేపట్టి వెళ్లిపోయాడు. కాగా అక్కడి వాస్తవ సమస్య మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది.

అటవీ అనుమతులపై హంగామాతో సరి

కాశినాయన క్షేత్రం అటవీ ప్రాంతంలో ఉంది. దానిని డీ నోటిఫై చేసి క్షేత్రానికి 13 హెక్టార్ల స్థలాన్ని ఇవ్వాలని ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కేంద్రానికి లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం సకాలంలో స్పందించలేదు. రాష్ట్రంలో అధికార మార్పిడి రాగానే కాశినాయన క్షేత్రంలో కట్టడాలు కూల్చివేతకు సిద్ధమయ్యారు. ఇక్కడ అసలు సమస్య అటవీ అనుమతులు తీసుకురావడం. కాగా మంత్రి నారా లోకేశ్ మాత్రం ప్రభుత్వానికి నష్ట నివారణ చర్యలు చేపట్టేందుకు రూ.5లక్షలు ఖర్చు చేసి, అంతా చల్లారిన తర్వాత అక్కడి నుంచి చల్లగా జారుకున్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. అటవీ అనుమతుల విషయంలో మాత్రం ఒక్క మాట మాట్లాడలేదు. అప్పట్లో టీడీపీ నేతలతో పాటు బీజేపీ నేతలు పోటీ పడి మరీ పర్యటనలు చేసి అటవీ అనుమతు లు తీసుకొస్తాం అంటూ హామీలు ఇచ్చి వెళ్లారు. ఆ తర్వాత ఆ సంగతే మర్చిపోయారని పలువురు వాపోతున్నారు.

» ఆర్టీసీ సర్వీసు మూన్నాళ్ల ముచ్చటే...

మంత్రి నారా లోకేశ్ కల్పించుకుని కాశినాయన క్షేత్రానికి ఆర్టీసీ బస్సు వేయించాడని గొప్పలు చెప్పుకున్నారు. కాశినాయన క్షేత్రంపై చిత్తశుద్ధితో ఉన్నారని భక్తులను సైతం భ్రమింపజేశారు. కాగా కూటమి సర్కార్ చర్యలన్నీ ప్రచారయావతో చేసినవిగా అతి స్వల్ప కాలంలోనే తేటతెల్లమైంది. మార్చి9న కూల్చివేతలు ప్రారంభించి, రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర దుమారం రేగడంతో నష్ట నివారణ చర్యలల్లో నిమగ్నమై నటించి వెళ్లారు. చివరికి ఆర్టీసీ సర్వీసు కూడా మూన్నాళ్ల ముచ్చటే అయింది. కావాల్సిన అటవీ అనుమతులు తీసుకురావడంలో మాత్రం టీడీపీ, బీజేపీ నేతలు మాట దాటేసి రాజకీయ పబ్బం గడుపుకుని వెళ్లిపోయారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

క్లుప్తంగా

15 మందికి జైలు శిక్ష

బద్వేలు అర్బన్ : డ్రంకెన్ డ్రైవ్, మట్కా, కేసుల్లో పట్టుబడిన 15 మందికి బద్వేల్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ముకేష్‌కుమార్ గురువారం జైలుశిక్ష విధించారు. బద్వేల్ అర్బన్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో ఒకరికి ఏడు రోజులు, మరొకరికి 10 రోజుల జైలుశిక్ష, గ్యాంబ్లింగ్, మట్కా కేసుల్లో పట్టుబడిన 13 మందికి ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై నిరంతరం తనిఖీలు, మట్కా, గ్యాంబ్లింగ్‌పై దాడులు కొనసాగుతాయన్నారు.

చంటి హత్యపై డీఎస్పీ ఆరా



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ మురళీనాయక్

చక్రాయపేట : మండలంలోని సురభి గ్రామం కోమటిపేటకు చెందిన చంటి హత్యపై డీఎస్పీ మురళీ నాయక్ శుక్రవారం ఆరా తీశారు. దేవరగుట్టపల్లె సమీపంలో దుండగులు చంటిపై దాడి చేసి పడేసి వెళ్లిన విషయం తెలిసిందే. హత్య జరిగిన స్థలాన్ని ఆర్కే వ్యాలీ సీఐ ఉలసయ్యతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. హత్యకు గల కారణాలు, కారకులను గుర్తించి కేసు త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు.

మృతదేహం లభ్యం

కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడు ఆర్సీఎం చర్చి వెనుక భాగాన తెలుగుగంగ కాల్వలో గుర్తు తెలియని మృతదేహం గురువారం లభ్యమైంది. అటుగా వెళుతున్న స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ తిమోతిలు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 60–65 సంవత్సరాల మధ్య ఉంటుందని, వారం రోజుల కిందట మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మోహినీ అలంకారంలో వేంకటేశ్వరుడు

జమ్మలమడుగు : నారాపురస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేంకటేశ్వరుడు భక్తులకు మోహినీ అలంకారంలో గురువారం దర్శనమిచ్చారు. గురువారం ఉదయం వేదపండితులు స్వామికి ప్రత్యేక పూజలు జరిపి మోహినీ రూపంలో అలంకరించారు. అనంతరం స్వామిని వాహనంపై కొలువుంచి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కీర్తనలు పాడుతూ, కోలాటం ఆడుతూ స్వామికి ఘన స్వాగతం పలికారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు వేంకటేశ్వరుడి కల్యాణం జరుపనున్నారు.

కక్ష సాధింపులతో రాక్షసానందం



మీడియాతో మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి

- రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది
- అభివృద్ధి లేదు.. హామీల అమలు లేదు
- జీహెచ్ఎంసీ యాక్టు చూపించి మేయర్ చర్యలేమిటి?
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్రంలో రాక్షస పాలన, రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని.. అభివృద్ధి లేకపోగా, ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదని వైఎస్సార్ సీపీ కడప జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. కడప వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి నేతలు కక్ష సాధింపులో మాత్రం ముందుంటూ రాక్షసానందం పొందుతున్నారన్నారు. నిరాధార కేసుల కారణంగా వాళ్లు పెడుతున్న కేసులేవీ కోర్టుల్లో నిలబడడం లేదన్నారు. కడప మేయర్ సురేష్ బాబు విషయంలోనూ అదే తీరులో వెళ్తున్నారన్నారు. అసలు కార్పొరేషన్ యాక్ట్ లేదని, జీహెచ్ఎంసీ యాక్ట్ అమలుచేయడం విడ్డూరంగా ఉందన్నారు. మేయర్ కుమారుడి సంస్థను కమిషనర్ రిజిస్టర్ చేశారని, అభ్యంతరమైతే అప్పుడు ఎందుకు రిజెక్ట్ చేయలేదని ప్రశ్నించారు. ఆరోపణల్లో ఏదైనా అవినీతి చూపించలేదని, కుర్చీల కోసం ఇదంతా జరుగుతోందన్నారు. ఎమ్మెల్యేకు చాలా కంపెనీలున్నాయని, మరి వాళ్లు కాంట్రాక్టులు చేయవచ్చా...? అని ప్రశ్నించారు. ఈ విషయంపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి నేరుగా ఫిర్యాదు చేశారని చెబుతున్నారని, ఇందులో రాజకీయం గాక ఇంకేముందని ప్రశ్నించారు. కడప నగరానికి పైసా నిధులు తీసుకురాలేకపోగా, కక్ష సాధింపులకు దిగడం సరికాదన్నారు. కార్పొరేషన్ సమావేశ వేదికపై మేయర్ ఒక్కరే కూర్చోవడం చట్టమన్నారు. ఆమెకు కుర్చీ వేయలేదని మేయర్ ఇంటిపై చెత్త వేయిస్తారా? తప్పుడు ఫిర్యాదు చేస్తారా? అని నిలదీశారు. అవిశ్వాసం పెట్టి మేయర్‌ను దించాలని ప్రయత్నం చేశారని, అది వీలు కాకపోవడంతో ఈ రకంగా కక్షసాధింపులకు దిగుతున్నారన్నారు. మేయర్‌పై చిన్న విషయాన్ని చూపి అనర్హత అనడం దారుణమని రవీంద్రనాథ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు పులి సునీల్‌కుమార్, బసవరాజు, జయచంద్రారెడ్డి, వెంకట రమణ, కంచుపాటి బాబు, కరీముల్లా, శ్రీరంజన్‌రెడ్డి, త్యాగరాజు, మోతుకూరు సుబ్బరాయుడు, రెడ్డిప్రసాద్, కార్పొరేటర్లు షఫీ, కె.బాబు, రామలక్ష్మణ్‌రెడ్డి, మల్లికార్జున, అలీ అక్బర్, గౌస్‌బాషా, షంషీర్, మగ్బూల్‌బాషా, సమ్మెట వాణి, జిలానీ, లక్ష్మయ్య, వీరారెడ్డి, ఊటుకూరు శ్రీను, కోఆప్షన్ మెంబర్ జహీర్, బండి ప్రసాద్, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన మైదుకూరు నాయకులు



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, మైదుకూరు మున్సిపాలిటీ నాయకులు

మైదుకూరు: ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం మైదుకూరు మున్సిపాలిటీ వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ మహబూబ్ షరీఫ్, కౌన్సిలర్లు వెంకటసుబ్బన్న, సుధాకర్, కో–ఆప్షన్ సభ్యులు ఎంఆర్‌ఎఫ్ సుబ్బయ్య, 8, 11, 18, 24వ వార్డుల ఇన్‌చార్జిలు భరత్ కుమార్‌రెడ్డి, పిల్లి నాగయ్య, కె.వెంకటసుబ్బయ్య, బీఎల్ రఘురామయ్య, పార్టీ పట్టణ అధ్యక్షుడు కేపీ లింగన్న, మాధవరాయస్వామి ఆలయ మాజీ చైర్మన్ భూమిరెడ్డి సుబ్బరాయుడు, కందనూరు షరీఫ్‌లు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీకి మున్సిపల్ చైర్మన్ రాజీనామా

మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర వైఎస్సార్‌సీపీ సభ్యత్వానికి గురువారం రాజీనామా చేశారు. ఈ విషయాన్ని ఆయన తన స్వగృహంలో విలేకరులకు వెల్లడించారు. నియోజకవర్గం అధినాయకత్వం ఐదేళ్లుగా తనను ఇబ్బందులు పెడుతోందని, అందుకు మనస్థాపం చెందుతూ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ఈ సందర్భంగా మాచనూరు చంద్ర తెలిపారు. తన రాజీనామా లేఖను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డికి ఫ్యాక్స్ ద్వారా పంపనున్నట్టు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో మున్సిపాలిటీ ఆరో వార్డు కౌన్సిలర్ గౌసియా భర్త, వార్డు ఇన్‌చార్జి షాషా, 23వ వార్డు కౌన్సిలర్ మహబూబ్‌బీ కుమారులు షౌకత్ అలీ, అక్బర్ పాల్గొన్నారు.

ఏపీ ఈసెట్ ఫలితాలు విడుదల

జిల్లాలో పలువురికీ ర్యాంకుల పంట

కడప ఎడ్యుకేషన్ : అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ గురువారం విడుదల చేసిన ఏపీఈసెట్ ఫలితాల్లో వైఎస్సార్ జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటి ర్యాంకుల పంట పండించారు. డిప్లమా హోల్డర్స్, బీఎస్సీ(మ్యాథమాటిక్స్) డిగ్రీ హోల్డర్స్ ఏపీ ఈసెట్‌లో అర్హత సాధించి లాటరల్ ఎంట్రీ ద్వారా ద్వితీయ సంవత్సరం ఇంజినీరింగ్ లేదా ఫార్మసీలో ప్రవేశం పొందవచ్చు. ఈ నెల 6న నిర్వహించిన ఈ పరీక్ష ఫలితాలు గురువారం వెలువడ్డాయి. రాజుపాలెం మండలం కుటూరు గ్రామానికి చెందిన మెట్టూ దివాకర్ రెండో ర్యాంకు, తొండూరు మండలం గుండ్లమడుగుకు చెందిన పల్లెటి రాజశ్రీ ఐదో ర్యాంకు, ఖాజీపేట మండలం సుంకేసులకు చెందిన తరుణ్ ఆరో ర్యాంకు, వేంపల్లి మండలం ముత్తుకూరుకు చెందిన వద్దరపు గణేష్ ఆరో ర్యాంకు, జమ్మలమడుగు మండలం పెద్దదండ్లూరు గ్రామానికి చెందిన గువ్వల జయచంద్రారెడ్డి పదో ర్యాంకు సాధించి భళా అనిపించారు.

సత్తా చాటిన మిషన్ డ్రైవర్ కొడుకు



స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన బాల మహేష్

తల్లితండ్రుల కష్టాలను తీర్చాలని కష్టపడి చదివి ర్యాంకు సాధించాడు బాల మహేష్. వేముల మండలం మబ్బుచింతపల్లె గ్రామానికి చెందిన గుజ్జల మారుతి యురేనియం ఫ్యాక్టరీలో ఓ మిషన్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా తల్లి గంగాదేవి గృహిణి. తల్లితండ్రుల కష్టాన్ని కళ్లారా చూసిన వారి కుమారుడు దేవి కుమారుడు గుజ్జల బాల మహేష్ కష్టపడి చదివి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారు. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు పులివెందులలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివిన మహేష్ డిప్లమో మైనింగ్ కోర్సు పులివెందుల లయోలా కళాశాలలో పూర్తి చేశారు. తాజాగా ఏపీ ఈసెట్‌లో 111 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ఫస్ట్ ర్యాంకు సాధించారు. పలువురు అతడిని అభినందించారు.

కూలీ కొడుకుకు ద్వితీయ ర్యాంకు



మెట్టు దివాకర్

కూలి పనులు చేసుకుంటున్న చిన్నపుల్లయ్య కుమారుడు ఏపీ ఈసెట్‌లో రాష్ట్ర స్థాయి ద్వితీయ ర్యాంకు సాధించాడు. రాజుపాలెం మండలం కూలూరు గ్రామానికి చెందిన మెట్టు చిన్నపుల్లయ్య, ఏసమ్మల కుమారుడు మెట్టు దివాకర్ ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు ఓ ప్రైవేటు పాఠశాలలో చదివాడు. ఆ తరువాత డిప్లమా ఈఈఈని తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పూర్తి చేశాడు. ఏపీ ఈసెట్ ఈఈఈ విభాగంలో రాష్ట్ర స్థాయి ద్వితీయ ర్యాంకు సాధించాడు. కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తి చేసి తల్లిదండ్రుల కష్టాలు తీరుస్తానని మెట్టు దివాకర్ తెలిపారు.

కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సమ్మె



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కార్మిక, రైతు, వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ఈ నెల 20న నిర్వహిస్తున్నట్లు వైఎస్ఆర్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు జాషువా, ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎల్.నాగసుబ్బారెడ్డి, మనోహర్ తెలిపారు. నగరంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం బలవంతపు భూ సేకరణ నిలిపివేయాలని కోరారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలు తొలగించి వాటిని వ్యవసాయ కార్మికులు, పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను బలహీన పర్చడం, అమ్మడం మానుకోవాలని సూచించారు. స్వయం ఉపాధి పొందుతున్న ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్‌పై ప్రభుత్వం ఆర్థిక దాడికి పాల్పడుతోందని, అన్ని రకాల రుసుము, పెనాల్టీలు, ట్యాక్స్ టోల్ చార్జీలు పెంచి నడ్డి విరుస్తోందన్నారు. అగ్రిగ్రేటర్స్ పేరుతో స్వదేశీ, విదేశీ బహుళ జాతి కంపెనీలకు అనుమతిస్తోందని, వాహన ఫిట్‌నెస్, రెన్యువల్, రిజిస్ట్రేషన్, లైసెన్స్ సేవలను ప్రైవేటు సంస్థలకు అప్పగించిందని ఆరోపించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ వర్కర్లను రెగ్యులరైజ్ చేసి పనికి తగిన వేతనం ఇవ్వాలన్నారు. బ్రిటీష్ కాలం నాటి నుంచి కార్మికులు పోరాడి సాధించిన హక్కులను హరించే లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్, కెసీ.బాదుల్లా, దస్తగిరిరెడ్డి, అన్వేష్, సుభాషిణి, లక్ష్మీదేవి, పి.సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కల తీరకుండానే.. కానరాని లోకాలకు

రైలు కింద పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య



శివానందరెడ్డి (ఫైల్)

కలసపాడు : కష్టపడి చదివించిన తండ్రి.. తాను కన్న కలలు కుమారుడు నెరవేరుస్తాడని ఆందనపడ్డాడు. తొమ్మిది నెలల కిందట ఓ యువతికి ఇచ్చి ఘనంగా వివాహం జరిపించిన తండ్రి ఇక తన కుమారుడికి ఏ లోటు లేదనుకున్నాడు. ఈ ఆనందం ఎంతో కాలం నిలవలేదు.. ఉన్నపాటుగా తన కుమారుడు రైలు కింద పడి మృతి చెందాడని సమాచారం రావడంతో గుండెలు బాదుకుంటూ బెంగళూరుకు వెళ్లాడు. బెంగళూరులో రైలు కింద పడి శివానందరెడ్డి గురువారం మృతిచెందాడు. బంధువులు, స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని మహానందిపల్లె గ్రామానికి చెందిన బిజివేముల పుల్లారెడ్డికి ఒక్కగానొక్క కుమారుడు శివానందరెడ్డి(25). ఇతడి తల్లి 15 ఏళ్ల కిందట మృతి చెందింది. అప్పటి నుంచి తన కుమారుడి భారం మోస్తూ కష్టపడి చదివించాడు తండ్రి పుల్లారెడ్డి. తొమ్మిది నెలల కిందట పోరుమామిళ్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతితో వివాహంజరిపించాడు. తండ్రి కలలు నెరవేర్చాలనే ఉద్దేశంతో శివానందరెడ్డి బెంగుళూరులో ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా చేరాడు. శుక్రవారం ఉదయం బెంగళూరులో రైలు కింద పడి తన ఒక్కగానొక్క కుమారుడు శివానందరెడ్డి మృతిచెందాడని తండ్రి పుల్లారెడ్డికి సమాచారం అందింది. దీంతో గుండెలు బాదుకుంటూ కుమారుడి కోసం బెంగళూరుకు బయలుదేరాడు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పెళ్లయిన నాలుగు నెలలకే యువతి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న హర్షియా

పులివెందుల రూరల్ : కంటికి రెప్పలా కాపాడుకుని.. అప్పులు చేసి తమ బిడ్డకు వివాహం చేశారు. అయితే అత్తింటివారు వరకట్నం తేవాలంటూ వేధించడంతో వివాహమైన నాలుగు నెలలకే నవ వధువు ఆత్మహత్య చేసుకుంది. పట్టణంలోని నగరిగుట్ట సమీపంలోని మసీదు వద్ద నవ వధువుశ హర్షియా(21) ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరిగుట్టకు చెందిన కరీముల్లా, జైబున్నీషాల కుమార్తె హర్షియాను అదే ప్రాంతానికి చెందిన ఫక్రుద్దీన్‌కు వచ్చి 2025 జనవరిలో వివాహం జరిపించారు. ఆనందంగా అత్తింటికి చేరిన హర్షియాకు నిత్యం వేధింపులు మొదలయ్యాయి. కట్నం డబ్బులు తేవాలంటూ భర్త ఫక్రుద్దీన్ వేధిస్తుండేవాడు. మానసికంగా కుంగిపోయిన నవ వధువు గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సీఐ చాంద్‌బాషా సంఘటన స్థలానికి చేరుకుని హర్షియా ఆత్మహత్యకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. వరకట్న వేధింపులు, డబ్బు సమస్యలతోనే హర్షియా ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ తెలిపారు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సీబీఎస్ఈలో పది విద్యార్థుల ప్రతిభ



కేజీవీఆర్ స్వరూప్‌రెడ్డి



ముని చరణ్



రెడ్డి లక్ష్మీ వైష్ణవి

కమలాపురం : మండలంలోని నల్లలింగాయపల్లె డీఏవీ భారతి విద్యామందిర్ విద్యార్థులు సీబీఎస్ఈలో ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ శివం కిషోర్‌కుమార్ తెలిపారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించడమేగాక, 77 శాతం క్యూపీఐ సాధించామని తెలిపారు. విద్యార్థి కేజీవీఆర్.స్వరూప్‌రెడ్డి 500 మార్కులకు గానూ 474, యం.మునిచరణ్ 465, యం.రెడ్డి లక్ష్మీవైష్ణవి 444 మార్కులతో మొదటి మూడు స్థానాలు సాధించారన్నారు. సాయి రమేష్, శేషాద్రి, సుబ్బలక్ష్మి, వేణుగోపాల్, భార్గవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నలుగురు అరెస్ట్

జమ్మలమడుగు రూరల్: మండలంలోని పి.బొమ్మేపల్లిలో ఈ నెల 10న జరిగిన హత్య కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ఎస్.లింగప్ప తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న పేడ నీళ్ల చల్లుకొనే విషయంలో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. బొగ్గు మల్లిఖార్జున, బొగ్గు శివకృష్ణ, బొగ్గు మునేష్, బొగ్గు నాగేంద్ర, బొగ్గు నడిపి సుబ్బరాయుడు, బొగ్గు నాగంజి అలియాస్ నాగాంజనేయులు, బొగ్గు నడిపి సుబ్బరాయుడు, బొగ్గు గురులక్ష్మీ కర్రలు, రాళ్లు తీసుకుని దాడి చేయడంతో గూడెంచెరువు రాజచౌడప్ప, జి.పెద్దచౌడప్ప, జి. రమణమ్మ, జి.సోమశేఖర్, జి.చౌడమ్మ, జి.సుహాసిని, రామచౌడయ్యలకు గాయాలయ్యాయి. గూడెంచెరువు రాజ చౌడప్ప(30)కు బలమైన గాయాలవడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. గూడెంచెరువు సోమ శేఖర్ ఫిర్యాదు మేరకు బొగ్గు మల్లిఖార్జున, బొగ్గు శివకృష్ణ, బొగ్గు, మేనేశ్వరుడు, బొగ్గు నాగేంద్రలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. ఎస్ఐలు రామకృష్ణ, హైమవతిపాల్గొన్నారు.

అరుదైన శస్త్ర చికిత్స



8 కిలోల కణితితో డాక్టర్ల బృందం

కడప అర్బన్ : గర్భాశయంలో కణితి తొలగించి అరుదైన శస్త్ర చికిత్స చేశారని గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మీసుశీల తెలిపారు. కడప నగరంలోని దర్బార్‌బీ(46) కడుపునొప్పి, ఉబ్బరంతో శనివారం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్(రిమ్స్)లో చేరిందని, పరీక్షలు జరిపాక సర్వైకల్ ఫైబ్రాయిడ్‌గా నిర్ధారించారన్నారు. డాక్టర్ అమానుల్లా మూడు గంటల పాటు శ్రమించి ఎనిమిది కిలోల బరువున్న గర్భాశయ ముఖ ద్వారం కణితి తొలగించారని తెలిపారు. ఇప్పుడు మహిళ ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. ఈ శస్త్ర చికిత్సలో డాక్టర్ అమానుల్లాతోపాటు డాక్టర్ రబ్బానీబేగం, డాక్టర్ మాధవి, అనస్తీషియా విభాగం వైద్యులు డాక్టర్ సునీల్ చిరువెళ్ల, డాక్టర్ బాలాజీ, డాక్టర్ సుబ్రహ్మణ్యం, యూరాలజీ విభాగం వైద్యులు డాక్టర్ శ్రీదీప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

దాడి కేసులో ఐదుగురు అరెస్టు

దువ్వూరు : స్థల వివాదంలో మృతిచెందిన కందుకూరు నారాయణ కేసులో ఐదుగురు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. సీఐ శివశంకర్ వివరాల మేరకు.. మండలంలోని ఏకోపల్లెలో కందుకూరు నారాయణ ఇంటి పక్కనే ఉన్న తలారి శివరామకృష్ణ నాయుడుకు స్థల వివాదం ఉంది. ఈ నెల 12న సర్వేయర్ కొలతలు వేస్తుండగా శివరామకృష్ణనాయుడు, కందుకూరు నారాయణ మధ్య ఘర్షణ తలెత్తింది. దీంతో శివరామకృష్ణ నాయుడు తన కుటుంబ సభ్యులతో కలిసి నారాయణపై దాడి చేశారు. అతడు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులు ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో చనిపోయారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తలారి శివరామకృష్ణ నాయుడు, తలారి నాగప్పనాయుడు, బోయ వెంకట సుబ్బరాయుడు, భోగ్యం శ్రీనివాసులు, బోయ కేశవనాయుడులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శివశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

చాపాడు: మండలంలోని పడమర అనంతపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత లోమడ జయరామిరెడ్డి తల్లి శతాధిక వృద్ధురాలు వీరమ్మ(102) గురువారం మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమ శిక్షణా కమిటీ చైర్మన్ శెట్టిపల్లె రఘురామిరెడ్డి గురువారం సాయంత్రం వీరమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం జయరామిరెడ్డి కుటుంబీకులు పరామర్శించారు. సీవీ సుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, మైను, రామసుబ్బారెడ్డి, రాజు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ బీభత్సం

- మద్యం మత్తులో బస్సును ఢీకొట్టి..
- ఐదుగురికి గాయాలు.
- క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్



మద్యం మత్తులో వున్న లారీ డ్రైవర్



క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీయడాన్ని పర్యవేక్షిస్తున్న ఎస్ఐ

వల్లూరు : మద్యం మత్తులో లారీని నడిపిన డ్రైవర్ బీభత్సం సృష్టించాడు. ఓ ద్విచక్ర వాహనం, ప్రైవేటు బస్సును ఢీకొట్టి అదుపుతప్పి రోడ్డు పక్కన వున్న బంకు, దాని పక్కనే వున్న చెట్టును ఢీకొట్టాడు. దీంతో ఐదుగురు గాయాలపాలవగా.. బంకుతోబాటు మూడు ద్విచక్ర వాహనాలు, బస్సు దెబ్బతిన్నాయి. వివరాల్లోకెలితే.. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం తిరుమలపురానికి చెందిన లారీ డ్రైవర్ షేక్ అబ్దుల్ అహమ్మద్ గురువారం గుజరా సామగ్రితో తాడిపత్రికి వెళ్తున్నారు. మద్యం మత్తులో కడప –తాడిపత్రి ప్రధాన రహదారిలో పాపాఘ్ని నగర్(కట్ట) బస్టాపు వద్ద లారీతో వేగంగా వెళ్తూ ద్విచక్ర వాహనాన్ని, దానికి ముందు ప్రయాణిస్తున్న ఓ ప్రైవేటు బస్సును ఢీకొట్టాడు. అనంతరం అదుపు తప్పి రోడ్డు పక్కన వున్న బంకును, దాని పక్కనే పార్కు చేసి వున్న రెండు ద్వి చక్రవాహనాలపై ఎక్కించాడు. చివరకు అదుపు తప్పి పక్కనే వున్న చెట్టును ఢీకొట్టాడు. లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కు యాడు. స్థానికులు అతన్ని బయటకు తీయడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. ఎస్ఐ పెద్ద ఓబన్న తన సిబ్బందితో వచ్చి జేసీబీ సహాయంతో లారీని కదిలించి రెండున్నర గంటల పాటు శ్రమించి డ్రైవర్‌ను బయటకు తీశారు. చికిత్స కోసం 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

- లారీ ఢీకొన్న ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులతో బాటు ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వారిని చికిత్స కోసం 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ మితిమీరి మద్యం తాగి నడపడమే కారణంగా తెలుస్తోంది.